## క్లుప్తంగా

### నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత బాలకృష్ణారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 2,00,117 విరాళంగా అందజేశారు. భాగంగా ఏలూరుకు చెందిన కాజా బాలకృష్ణారావు రూ.1,00,001, నూజివీడుకు చెందిన ఆరేపల్లి సత్యన్నారాయణ రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

### ఉపాధి పనుల పరిశీలన

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మస్తర్లను పరిశీలించారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, మంచినీళ్లు అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు.

### న్యాయం చేయాలంటూ ఆందోళన

జంగారెడ్డిగూడెం రూరల్ : న్యాయం చేయాలని, లేకుంటే పురుగుమందు సేవించి ఆత్మహత్యలకు పాల్పడతామంటూ లక్కవరంలో రెండు కుటుంబాలు పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేపట్టారు. గత 60 ఏళ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్న భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించారని ఆరుగొల్లు వెంకట నరసయ్య, ఆరుగొల్లు రాములు కుటుంబ సభ్యులు తెలిపారు. భూమిపై ఆధాపడి జీవిస్తున్నామని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్లీవ జోజిని వివరణ కోరగా ఇరు కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా వేరొక ప్రాంతంలో భూమిని కేటాయించామని, అసైన్డ్ కమిటీ నిర్ణయంతో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇరు కుటుంబాలకు చెందిన వారు ఇవ్వాలంటున్న భూమి ప్రభుత్వానికి చెందిన రోడ్డు పోరంబోకు భూమి అని, ఈ భూమిని ఇళ్ల స్థలాలుగా కేటాయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నెల రోజులు పైనే కావస్తుందని తహసీల్దార్ చెప్పారు. అనంతరం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, తహసీల్దార్ స్లీవజోజి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ ఆందోళనకారులతో చర్చించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఆందోళన చేపట్టిన నరసయ్య కుటంబానికి తహసీల్దార్ స్లీవజోజి సూచించారు. దీంతో అంగీకరించిన నరసయ్య కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

టి.నరసాపురం: విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న రాత్రి బొర్రంపాలెంకు చెందిన చింతా దుర్గమ్మ (72)ను భర్త దుర్గయ్య అనుమానంతో బ్లేడ్‌తో గొంతు కోసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దుర్గమ్మను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త దుర్గయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

# చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ



కొయ్యలగూడెంలో మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



జంగారెడ్డిగూడెంలో మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్ సీపీ నేతలు



గోపాలపురానికి బైక్ ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నేతలు

కొయ్యలగూడెం : జగన్నాథ రథచక్రాల ముందు వెన్నుపోటు బాబులు, మరే ఇతర ప్రజా వ్యతిరేక శక్తులు నిలవలేరని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కొయ్యలగూడెంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలను అవహేళన చేసిన చంద్రబాబు, నేడు అవే పథకాలను కాపీ కొట్టి మహానాడు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం జగనన్న సంక్షేమ పథకాలకు విలువ నివడమేనన్నారు. ఉచిత పథకాలతో ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవబోతోంది అంటూ ఉత్తర కుమారుడు లోకేష్ బాబు, దత్త కుమారుడు పవన్ కళ్యాణ్ గగ్గోలు పెట్టారని, కానీ అయితే జగన్ మోహన్ రెడ్డి పథకాలే ఎప్పటికీ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని వారు భావించక తప్పలేదన్నారు. దైవాశీస్సులు, ప్రజాబలం మెండుగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో మారు ముఖ్యమంత్రి కావడం తథ్యం అన్నారు. కొయ్యలగూడెం, గవరవరం, అంకాలగూడెం, రేపల్లెవాడ, డిప్పకాయలపాడు, కన్నాపురం, గ్రామాల మీదుగా రెండు వందల మోటారు సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, టౌన్ కన్వీనర్ సంకుకొండ, సర్పంచులు ఏలేటి చిన్న తుక్కయ్య, కడకట్ల గడ్డియ్య, సున్నం శాంత కుమారి, వుప్పల పద్మావతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**చంద్రబాబు కుసంస్కారానికి నిదర్శనం**

జంగారెడ్డిగూడెం : అమరావతిలో ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో చంద్రబాబు వ్యాఖ్యలు ఆయన కుసంస్కారానికి అద్దం పడుతుందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మోటార్‌సైకిల్ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా చంద్రబాబుకు హౌసింగ్ ఛాలెంజ్ విసిరారు. దమ్మంటే క్షేత్రస్థాయిలో జగనన్న కాలనీకి వచ్చి చూడండి. మేము చేస్తున్న అభివృద్ధి మీకు కనబడుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, పార్టీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, బత్తిన చిన్న, గురజాల పార్థసారథి, సచివాలయాల మండల కన్వీనర్ అనిల్, సింగంశెట్టి సత్తిరాజు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**చంద్రబాబుకు మతిభ్రమించింది**

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణ చూసి మతిభ్రమించిన టీడీపీ అధినేత చంద్రబాబు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జగనన్న ఇళ్ల స్థలాల్లో సమాధులు కట్టాలన్న చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నల్లజర్ల నుంచి గోపాలపురం వరకు భారీ బైక్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. అందులో ద్వారకాతిరుమల మండలంకు చెందిన పార్టీ నాయకులు, కార్యర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, అచంట బన్ను, పెద్దిన దిలీప్, జీవీ కృష్ణారెడ్డి, మానుకొండ సుబ్బారావు, వసంతాటి సుబ్బారావు, భోగరాజు పెద్ద చిన్ని, చిన్నచిన్ని, షేక్ భాషా, కొండా బత్తుల గిరి, దాసరి రాంబాబు, బిరుదుగడ్డ చల్లారావు, గోపా నాగేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, చెలికాని బుల్లియ్య, మానుకొండ ప్రసాద్, కేవీఆర్, దాసరి ఏసురత్నం, దాకారపు అగ్గియ్య, జిత్తుక శ్రీను, బోళ్ల శ్రీను, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు, అల్లాడ హరేరామకృష్ణ తదితరులున్నారు.

### విద్యార్థులచే సూర్యనమస్కారాలు



ధర్మాజీగూడెంలో విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పిస్తున్న దృశ్యం

లింగపాలెం : వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించారు. ఏవీ నారాయణ సూర్య నమస్కారాల ప్రాముఖ్యత వివరించి వాటిని ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సరళ కుమారి తెలుగు గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు మైండ్ మెమరీ గేమ్స్, చదరంగం క్రీడ నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి వి రమణ తెలిపారు.

### బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం : రెండు రోజులుగా తీవ్రమైన గాలివానకు మండలంలోని తెల్లంవారిగూడెం గ్రామంలో చెట్ల కొమ్మలు విరిగిపడి కూలిపోయిన ఇళ్ల బాధితులకు సోమవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా ప్రభుత్వ తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అండగాం ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి రమణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ తెల్లం రాముడు, తహసీల్దార్ ఎస్ శారశాంతి, పార్టీ నాయకులు కారం వెంకటరమణ, తెల్లం దుర్గారావు పాల్గొన్నారు.

## ‘గడపగడపకు’లో సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత



దాసయ్యపాలెంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం : పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దాసయ్యపాలెంలో సోమవారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బాలరాజు ప్రజలకు వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో మారుమూల అటవీప్రాంతంలోని గ్రామాల గిరిజనులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని అన్నారు. చంద్రబాబు మళ్లీ అబద్ధాల మేనిఫెస్టోతో మోసం చేసేందుకు చూస్తున్నాడని, వచ్చే ఎన్నికల్లో కూడా అతడ్ని తరిమి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజ్జీ, కరాటం కృష్ణస్వరూప్, తెల్లం సింహాచలం, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ మొడియం వెంకమ్మ, ఎంపీడీవో ఎం.శ్రీహరి, తహసీల్దార్ ఎస్ శారాశాంతి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మరోసారి సీఎంగా జగన్ గెలుపు ఖాయం**

జంగారెడ్డిగూడెం : ఇచ్చిన హామీలు అమలు చేసి చేతల నాయకుడిగా నిరూపించుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా గెలవడం ఖాయం అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో 26వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కోసమే పనిచేసే నాయకులను నమ్మొద్దని, ఎల్లప్పుడు ప్రజాసంక్షేమమే కోరుకునే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయడమే కాకుండా, ఆ హామీల అమలు తీరును కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. చరిత్రలో నిలిచిపోయే పథకాలను అమలు చేస్తూ, ప్రజల గుండెల్లో నిలిచిపోయిన జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైతం సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఎంపీపీ కొదమ జ్యోతి, స్థానిక కౌన్సిలర్ చిటికెల అచ్చిరాజు, బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్, చిప్పాడ వెంకన్న, షేక్ అక్బర్, వందనపు వెంకటేశ్వరరావు, గురజాల పార్థసారథి, అనిల్ గౌడ్, కేమిశెట్టి మల్లిబాబు, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు

పోలవరం రూరల్ : గూటాల గ్రామంలో తపన ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో కొవ్వూరు, గూటాల జట్ల మధ్య హోరా హోరీగా జరిగిన పోటీలో కొవ్వూరు జట్టు విజయం సాధించింది. ప్రథమ స్థానంలో నిలిచిన కొవ్వూరు జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 30వేలు నగదు, 2వ స్థానంలో నిలిచిన గూటాల జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20వేల నగదును అందజేశారు. విజేతలకు తపన చౌదరి బహుమతులను అందజేశారు. పోలవరం మండల బీజేపీ అధ్యక్షుడు కామిశెట్టి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు మొబైల్ ఫోన్. సోషల్ మీడియా ప్రభావం, ఫేస్‌బుక్, యూట్యూబ్ వల్ల లాభనష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పి.దుర్గారావు తెలిపారు.



### నేడు చింతలపూడిలో మెగా జాబ్‌మేళా

చింతలపూడి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 కంపెనీల ప్రతినిధులు నేరుగా పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### కచ్చా డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టాలి

పోలవరం రూరల్ : పోలవరం గ్రామంలోని వర్షం నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా కచ్చా డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన పోలవరం గ్రామంలోని యడ్లగూడెం నుంచి పాత పోలవరం వరకు 2.5 కిలోమీటర్ల పొడవున నిర్మించిన నెక్లెస్‌బండ్ గట్టును అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. నెక్లెస్‌బండ్ గట్టుకు ర్యాంపుల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని ఏజీఆర్‌బీ ఏఈ సునీల్‌బాబుకు తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.రామకృష్ణ ఉన్నారు.

### విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

చింతలపూడి : పట్టణంలో అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ డీఈ కేఆర్ అంబేద్కర్ తెలిపారు. సోమవారం ఆయన చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఆదివారం వీచిన ఈదురుగాలులకు పట్టణంలో 20 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్‌లు పడిపోయాయని చెప్పారు. పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏడీఈ రాధాకృష్ణ, ఏఈ వెంకయ్య ఉన్నారు.

### విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

కామవరపుకోట: విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన తడికలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తడికలపూడి గ్రామానికి చెందిన పొద్దుటూరు కరుణమ్మ (60) గ్రామంలో పశువులను మేపుతూ కుటుంబ సభ్యులకు సహాయంగా ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం సమీప పామాయిల్ తోటలోకి పశువులను తోలుకుని వెళుతుండగా తోటలోని విద్యుత్ వైరు తెగి ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న వృద్ధురాలు, గేదె మీద పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వివరాలు సేకరించారు.